క్లుప్తంగా

అక్రమ అరెస్టులు బాధాకరం



పోలీసుల అదుపులో బీఆర్ఎస్ శ్రేణులు

కందుకూరు: ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కాకి దశరథ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్‌లో మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా దశరథ ఆధ్వర్యంలో తరలివెళ్తున్న పార్టీ శ్రేణులను బుధవారం పోలీసులు అరెస్టు చేసి, సాయంత్రం వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఫార్మా కంపెనీలతో కాలుష్యం వెదజల్లి, భవిష్యత్‌లో అక్కడ నివసించలేని పరిస్థితిని కల్పిస్తున్నారని విమర్శించారు. ప్రజల పక్షాన పోరాటం చేయడానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం అన్యాయమన్నారు.

టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా రామకృష్ణారెడ్డి



రామకృష్ణారెడ్డిని అభినందిస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డిని టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నాదర్‌గుల్‌లోని బీజేపీ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు విచ్చేసి రామకృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, బీజేపీ సభ్యత్వ నమోదు కమిటీ కన్వీనర్ నడికుడి యాదగిరి, కార్పొరేటర్ బంగారు అనిత ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు ఆహ్వానం



కేటీఆర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న కుర్మసంఘం నాయకులు తదితరులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ 23వ డివిజన్‌లో ఈ నెల 16న బీరప్ప దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణోత్సవానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆహ్వానించారు. బుధవారం కుర్మసంఘం నాయకులు ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందచేశారు. వీరితో పాటు ఎమ్మెల్యే సబితారెడ్డి, పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని ఆహ్వానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గౌర సాయికుమార్, నాయకులు భీమిడి జంగారెడ్డి, కర్రె బల్వంత్, నందినేని నరేందర్‌రెడ్డి, సామ దర్శన్‌రెడ్డి, గట్టు మహిపాల్, భీమా, జగదీష్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మీర్‌పేట: బాలాపూర్ చౌరస్తాలోని వైష్ణవి మెడికల్ స్టోర్ కెమిస్ట్ బాలముకుంద్ మృతి చెందిన విషయం తెలుసుకొని జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెండెం కృష్ణకుమార్, ఉపాధ్యక్షుడు కర్నాటి గణేష్‌ల ఆధ్వర్యంలో స్థానిక మెడికల్ షాపుల యజమానులు రూ.51వేలు బుధవారం మృతుడి భార్య జయలక్ష్మికి అందజేశారు. రాజు, సురేష్, ఇంద్రారెడ్డి, గఫర్‌ఖాన్, గౌస్‌లు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్‌పర్సన్‌కు సన్మానం

కడ్తాల్: ఉమ్మడి పాలమూరు జిల్లా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా జ్యోతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల అధ్యక్షులు జగన్, ప్రభాకర్ రెడ్డి, డీసీసీ సభ్యులు భగవాన్‌రెడ్డి చైర్‌పర్సన్ జ్యోతి దంపతులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అంబాజీ, రవి, కృష్ణ, ఆరీఫ్ ఉన్నారు.

కాన్షీరామ్‌కు నివాళి

తుర్కయంజాల్: బహుజన వర్గాలు అధికారంలో ఉంటేనే పేదల జీవితాల్లో మార్పు సాధ్యం అవుతుందని విశ్వసించిన కాన్షీరామ్ అని బీఎస్పీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు కుమార్, కోశాధికారి రమేష్‌లు అన్నారు. బుధవారం కాన్షీరామ్ 18వ వర్ధంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబు, రమణ, సైదులు, రాజు, రఘు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట: అమ్మవారిని దర్శించుకున్న మేయర్ పారిజాత, కార్పొరేటర్లు



పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీలో దుర్గామాతను దర్శించుకున్న కేఎల్లార్

సరస్వతీ నమస్తుభ్యం



మీర్‌పేట: జిల్లెలగూడలో..

- కొనసాగుతున్న దేవీశరన్నవరాత్రోత్సవాలు
- చదువుల తల్లిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరిదేవి
- ప్రత్యేక పూజలు చేసిన భక్తజనం
- చిన్నారులకు అక్షరాభ్యాసం

మహేశ్వరం: దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల సందర్భంగా శివగంగ రాజరాజేశ్వరి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడో రోజైన బుధవారం సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తజనం అమ్మవారికి, పరమ శివుడికి పూజలు చేశారు. హారతి, అభిషేకం, అర్చన, సుప్రభాత సేవ, పంచామృతాషేకం, సహస్రనామార్చన, హోమం, మంత్ర పుష్పం, గణపతి, నవగ్రహ హోమం, మంత్రపుష్పం, సరస్వతీ దేవి హోమం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయంలో సంగెం అనిత-శేఖర్ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, మాజీ ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్, ఆలయ ఈఓ మురళీ కృష్ణ, డైరెక్టర్లు, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

నాగారంలో..

మండల పరిధి నాగారం గ్రామంలో పోడ చెట్టు వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, హారతీ, కుంకుమార్చన, మంత్రపుష్పంతో పాటు పుష్పాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, మాజీ సర్పంచ్‌లు దశరథ, లావణ్య, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లింగం ముదిరాజ్, కార్య నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కుమార్, లక్ష్మణ్, సభ్యులు మహేందర్, రఘు, రాము, కార్తీక్ పలువురు పాల్గొన్నారు.

దుర్గామాత సన్నిధిలో అన్నదానం

కందుకూరు: మండల కేంద్రంలోని దుర్గాదేవి మండపం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా.. మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ప్రారంభించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, కృష్ణనాయక్, మల్లేశ్, పాండు, వెంకటేశ్ గౌడ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: జిల్లెలగూడ నవభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. కార్పొరేటర్ అనిల్‌యాదవ్, వేంకటేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్త రమేష్, బీఆర్ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు కామేష్‌రెడ్డిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సరస్వతీదేవిగా ఎలమ్మ భక్తులను అనుగ్రహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని భక్తజనం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మహాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, పూజారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత పూజలో కేఎల్లార్

పహాడీషరీఫ్: దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మహేశ్వరం కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి జల్‌పల్లి మున్సిపాలిటీలోని మండపాలను బుధవారం దర్శించుకున్నారు. జల్‌పల్లి గ్రామంతో పాటు శ్రీరాం కాలనీలోని యంగ్ ఇండియా యూత్ అసోసియేషన్ దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధి నాగార్జున ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్ రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి, కౌన్సిలర్లు బుడుమాల యాదగిరి, కెంచె లక్ష్మీనారాయణ, షేక్ జహంగీరుద్దీన్, కొండల్ యాదవ్, మన్న రవికుమార్, నవీన్ గౌడ్, యూసుఫ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: సరస్వతీదేవిగా దర్శనం ఇచ్చిన సూర్యగిరి ఎల్లమ్మ



మహేశ్వరం: సరస్వతీదేవి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



మహేశ్వరం: రాజరాజేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మహేశ్వరం: నాగారం దుర్గామాత సన్నిధిలో ముగ్గుల పోటీలు

ఫార్మాసిటీని రద్దు చేసి..



బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తంచేస్తున్న భూ బాధిత మహిళలు, రైతులు

- మా భూములు మాకు ఇప్పించండి
- బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తంచేసిన భూబాధితులు

యాచారం: ఫార్మాసిటీని రద్దు చేసి, భూసేకరణలో టీజీఐఐసీ పేరిట మార్చిన తమ పట్టా భూముల రికార్డులను తమ పేరిట మార్చాలని భూ బాధితులు డిమాండ్ చేశారు. బుధవారం నక్కర్తమేడిపల్లి-నానక్‌నగర్ గ్రామాల మధ్య నిర్మించిన ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి స్తూపం వద్ద నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద భూ బాధితులు ఫార్మాసిటీ పేరిట సేకరించిన పొలాల్లో బతుకమ్మ ఆడారు. 'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. ఫార్మాసిటీని రద్దు చేసేలా చూడు తల్లి ఉయ్యాలో.. ఫార్మాసిటీని రద్దు చేసి ఉయ్యాలో టీజీఐఐసీ పేరు మీదున్న మా పట్టా భూములు ఉయ్యాలో.. రైతుల పేరిట మార్చేలా చూడు తల్లి ఉయ్యాలో' అంటూ పాటలు పాడి నిరసన వ్యక్తం చేశారు. తాజాగా ఇచ్చిన హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసి, రైతుల పేరిట భూ రికార్డులు మార్చాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు లేఖలు పంపేందుకు సంతకాలు సేకరించారు.



సంతకాలు సేకరిస్తున్న రైతులు

బీఆర్ఎస్ నేతల అరెస్టు

ఇబ్రహీంపట్నం: ఫార్మా కంపెనీని రద్దు చేయాలని రైతులు బుధవారం చేపట్టిన మహాపాదయాత్రకు బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు మద్దతుగా వెళ్తున్నారే సమాచారంతో పట్నం పోలీసులు వారిని ముందస్తుగా అరెస్ట్ చేశారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీని వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా బయలు దేరేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులను.. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు బాలస్వామి, శివ, గణేశ్‌నాయక్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా పత్యానాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తుందని ఆరోపించారు.



ఇబ్రహీంపట్నం: పోలీసుల అదుపులో నేతలు

బాధ్యతలు చేపట్టిన సీఐ సుధాకర్



పహాడీషరీఫ్: బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.సుధాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సుధాకర్ గతంలో పహాడీషరీఫ్, బాలాపూర్ ఠాణాలో ఎస్ఐగా పనిచేశారు. 2016లో పోలీస్ స్టేషన్ల పునర్విభజనతో పహాడీషరీఫ్ నుంచి నూతంగా ఏర్పడిన బాలాపూర్ ఠాణాకు కొంతకాలం ఎస్ఐ ర్యాంక్‌తో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యమని, ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రజాసేవే లక్ష్యంగా..

- ప్రత్యక్ష రాజకీయాలపై బిలకంటి ఆసక్తి
- కాంగ్రెస్ పెద్దల ఆశీస్సులతో స్థానిక ఎన్నికల బరిలో దిగేందుకు ఏర్పాట్లు
- ప్రజాదరణ కలిగిన వ్యక్తిగా చంద్రశేఖర్‌రెడ్డికి గుర్తింపు

యాచారం: ప్రజాసేవలో తరించాలన్న తపనతో ఆయన ఉపాధ్యాయ వృత్తిని వీడారు. అనంతరం పరోక్షంగా రెండు దశాబ్దాలుగా ప్రజాసేవలో సేదతీరుతున్నారు. తన తండ్రి పేరిట ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి మండల ప్రజలకు తనవంతు సాయం చేస్తున్నారు. స్థిరాస్తి వ్యాపారంలోనూ రాణిస్తూ.. పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ప్రస్తుతం ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. అందుకు రాజకీయ అరంగేట్రమే సరైందని నిర్ణయించుకున్నారు. రాజకీయ ప్రముఖుల అండదండలతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు.. బీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి.

పేద విద్యార్థులకు అండగా..

యాచారం మండలం నందివనపర్తి గ్రామంలోని రైతు కుటుంబానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి.. ఓ ఉపాధ్యాయుడిగానే కాకుండా.. సేవాసంస్థ బీఎస్ఆర్ అధినేతగా ప్రజలకు సుపరిచితుడు. రాజకీయాలపై ఆసక్తితో ఉన్న ఆయన.. బీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు విస్తృతంగా సేవలందిస్తున్నారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి, పేద విద్యార్థులకు ఆర్టీసీ బసు పాసులు ఇప్పిస్తున్నారు. ఉన్నత చదవుల కోసం రూ.లక్షల్లో ఆర్థిక సాయం చేస్తున్నారు. పేదల కుటుంబీకుల్లో ఎవరైనా చనిపోతే ఆర్థిక సహాయం చేసి అండగా నిలుస్తున్నారు. ఇబ్రహీంపట్నం, కందుకూరు, మంచాల మండలాలతో పాటు తుర్కయంజాల్, ఆదిబట్ల మున్సిపాలిటీ ప్రజలకు ఆర్థిక సేవలు అందిస్తున్నారు. నందివనపర్తి శ్రీ జ్ఞాన సరస్వతి, ఆంజనేయస్వామి దేవాలయం, ఓంకారేశ్వరాలయం, శివలయాల నిర్మాణాలకు రూ.లక్షల్లో విరాళం ఇచ్చారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో చంద్రశేఖర్‌రెడ్డి

అవకాశం కలిసొస్తే..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో దగ్గరి పరిచయాలు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అండదండలు, రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి ఆశీస్సులతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు చంద్రశేఖర్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారు. అవకాశం కలిసొస్తే మండలం నుంచి జెడ్పీటీసీ, ఎంపీపీ, జనరల్ అయితే ఎదో ఒక గ్రామం నుంచి ఎంపీటీసీగా పోటీ చేయడానికి ప్రణాళికలు రూపొందించుకున్నారు. అవసరమైతే.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష బాధ్యతలు చేపట్టడానికి రెడీ అంటున్నారు. ప్రజా సేవకుడిగా గుర్తింపు పొందిన బిలకంటి.. ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేయడానికి రాజకీయాల్లో వస్తే ప్రజలకు మరింత మంచి జరుగుతుందని, ఆయన మండలం నుంచి ఏ పదవికి పోటీలో నిలిచినా.. గెలుపు తథ్యమని మండల ప్రజలు స్పష్టంచేస్తున్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

తుక్కుగూడ: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.పాపయ్యగౌడ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో భారీగా సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ అని, 18 సంవత్సరాలు నిండిన యువతకు సభ్యత్వం అందజేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ముఖ్యంగా మహిళలను రాజకీయంగా చైతన్యం పర్చాలన్నారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసిన హర్యానా ప్రజలు.. పార్టీకి మరోసారి అధికారం ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం నూతన చైర్‌పర్సన్ బరిగల హేమలత దంపతులను కమలనాథులు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సిలర్ రాజమౌని రాజు, నాయకులు తలారీ శ్రీనివాస్, ఆంజనేయులు, మాధవరెడ్డి, కృష్ణాగౌడ్, రాకేష్‌గౌడ్, నార్లకంటి బాల్‌రాజు, ఎడ్ల శ్రీశైలం యాదవ్, శ్రీకాంత్, నర్సింగ్, కృష్ణా, దయానంద్, ప్రశాంత్, నవీన్, యాదయ్య పాల్గొన్నారు.



చైర్‌పర్సన్ హేమలత దంపతులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

శ్మశానవాటిక స్థలాన్ని కాపాడండి

ఆర్డీఓ అనంతరెడ్డికి సీపీఎం నేతల వినతి

ఇబ్రహీంపట్నం: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలో సర్వే నంబర్ 212/1లో ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జాకోరుల నుంచి రక్షించాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు యాదయ్య మాట్లాడుతూ.. 15 సంవత్సరాల క్రితం సీపీఎం పోరాట ఫలితంగా 212 సర్వే నంబర్‌లో రెండు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం శ్మశాన వాటికకు కేటాయించిందని తెలిపారు. ఆ భూమికి రక్షణగా చుట్టూ ప్రహరీ లేదని పేర్కొన్నారు. దీంతో రియల్టర్లు, స్వార్థ రాజకీయ నాయకులు కొందరూ ఎకరానికి పైగా భూమిని అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. భూమిని రీసర్వే చేయించి, కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కిషన్, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ్మ, సత్యనారాయణ, భాస్కర్, కృష్ణ, ఆశీర్వాదం, పొట్టి శ్రీనివాస్, పరమేశ్‌లున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

సవరణలు చేయించుకోండి

- ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ అఫ్జల్
- 21వ వార్డులో నూతన ఆధార్ కేంద్రం ప్రారంభం

పహాడీషరీఫ్: ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డుల్లో ఏమైనా తప్పులు ఉంటే సవరణలు చేయించుకోవాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ అఫ్జల్ పేర్కొన్నారు. 21వ వార్డులో ఏర్పాటు చేసిన నూతన ఆధార్ కేంద్రాన్ని స్థానిక కౌన్సిలర్ షేక్ ఫమిదాతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చాలా మంది ఆధార్ కార్డుల్లో అప్‌డేట్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోకుండా సరిచేసుకోవాలని వారు సూచించారు.



వాదే ముస్తఫా బస్తీలో ప్రారంభమైన ఆధార్ నమోదు కేంద్రం

తెల్ల కుసుమ విత్తనాల పంపిణీ

షాబాద్: రైతులకు తెల్ల కుసుమ విత్తనాలు పంపిణీ చేసినట్లు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ, రేగడిదోస్వాడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ గ్రామాల్లో రైతులకు కుసుమ విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ నూనెగింజల పరిశోధన స్థానం రాజేంద్రనగర్ వారి సహకారంతో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెల్ల కుసుమ సాగు చేసేందుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. రైతులకు తెల్ల కుసమ సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐ ఓ ఆర్ టెక్నీషియన్ నందీశ్వర్, రైతులు చంద్రారెడ్డి, మల్లయ్య, చెన్నయ్య, రాంచంద్రయ్య, మాధవరెడ్డి, యాదవరెడ్డి, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న రత్నాకర్

యువత క్రీడల్లో రాణించాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: యువత క్రీడల్లో రాణించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెలిజర్ల గ్రామ పంచాయితీ కాలనీ తండాలో బాబు నాయక్, శివ ఏర్పాటు చేసిన సీపీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. యువతకు చదువు ఎంత ముఖ్యమో, క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించి సత్తా చాటాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, ఇలాంటి టోర్నీలతోనే యువత ప్రతిభను ప్రదర్శించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్నాతి శ్రీనివాస్, లష్కర్ నాయక్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, బాబు నాయక్, శివ పాల్గొన్నారు.